సీరియల్ కథ

ప్రేమకు పెళ్ళెప్పుడు?

రచన :
శ్రీ రేగులపాటి కిషన్ రావు.

(గత సంచిక తరువాయి)

ముగ్గురమ్మాయిలు మంచములో ప్రక్క ప్రక్కన కూర్చుండి వున్నారు. మధ్యనున్న అమ్మాయి చేతిలో ఏదో సినిమా పత్రిక వుంది, ఆ పత్రికలో ఏముందో కాని ముగ్గురూ కుతూహలంగా చూస్తున్నారు.

ప్రకాశ్ వాళ్ళవైపు ఆసక్తిగా చూడసాగాడు. పదిహేను, పదహారు సంవత్సరాల అమ్మాయిలు వాళ్ళు. అందంగా ఆరోగ్యంగా వున్నారు.

పత్రిక తిరగేస్తున్న శోభారాణి కడివైపు పోజులో వున్న అర్ధనగ్న స్త్రీని చూస్తూ అంది "రాను రాను ఈ సినిమా వ్యాపారు ఆడవాళ్ళను నగ్నంగా నిలబెట్టి సినిమాలు తీసేట్టు వున్నారు"

"అలా గనుక సినిమాలు తీస్తే మగవాళ్ళ విషయం ఏమోగానీ ఆడవాళ్ళు మాత్రం ఎవ్వరూ చూడరు" అంది నీలిమ ముఖం చిట్లిస్తూ.

"అని ఎలా అనగలుగుతున్నావు? ఇప్పుడు వస్తున్న అర్ధనగ్న చిత్రాలను ఆడవాళ్ళు చూడడం లేదా?" ప్రేమ ప్రశ్నించింది. ఆమె పేరు ప్రేమలత. కాని అందరూ ఆమెను 'ప్రేమ' అనే పిలుస్తారు.

"నేనైతే అలాంటి సినిమా ఒక్కటీ చూడలేదు"

"నేను చాలా సినిమాలు చూశాను"

"పోనీ నువ్వు ఒక మగవాని ముందు అర్ధనగ్నంగా నిలబడగలవా?" ఎదురు ప్రశ్న వేసింది నీలిమ.

"అర్ధనగ్న చిత్రాలు చూచే ఆడవాళ్ళంతా అర్ధనగ్నంగా ఒక మగవాని ముందు నిలబడాలంటావా?"

నీలిమ మాట్లాడలేదు.

శోభారాణి అంది "పరాయి మగవాళ్ళముందు అర్ధనగ్నంగా నిలబడే స్త్రీలు నిజంగా సిగ్గులేనివాళ్ళే"

"పరాయి మగవాళ్ళేమిటి?..." నీలిమ అర్థం కానట్టు ముఖం పెట్టి శోభారాణివైపు చూచింది.

"నా భర్త దగ్గర నేను అర్ధనగ్నంగానే కాదు, నగ్నంగానైనా వుండగలను. పెళ్ళైతే అలాంటి అనుభవం మీకూ దొరుకుతుంది" శోభారాణికి నాలుగు నెలల క్రితమే వివాహమైంది.

నీలిమ, ప్రేమ ఒకరి ముఖాలొకరు చూచుకుంటూ నవ్వసాగారు.

శోభారాణి నీలిమ వీపు తట్టుతూ అంది "అటు చూడు"

నీలిమ, ప్రేమ శోభారాణి సైగ చేసి చూపించిన వైపు చూశారు. వారికి ప్రకాశ్ కనిపించాడు.

ప్రేమ కాస్త కోపంతో అడిగింది "ఎవరునువ్వు?"

"దొంగను మాత్రం కాదు" అన్నాడు ప్రకాశ్.

"దొరలా మాత్రం లేవు" అంది ప్రేమ

ప్రకాశ్ నవ్వాడు.

"నవ్వడం కాదు. మేము మాట్లాడుకునే మాటలను రహస్యంగా వింటున్న నువ్వు సిగ్గుపడాలి, వెళ్ళు బయటకు"

ప్రకాశ్ నిటారుగా నిలబడి అన్నాడు "వెళ్ళకపోతే?"

"వెళ్ళకపోతేనా... ఊ వెళ్ళకపోతే నీ చెంపకు నా చేతి రుచి చూపిస్తా"

"మీ ఇంటికి వచ్చిన అతిథికి మీరు చేసే సత్కారమా అది"

అంతవరకు ఊపిరి బిగబట్టి చూస్తున్న శోభారాణి, నీలిమ ఫక్కున నవ్వారు.

ప్రేమ అటువైపు చూచింది. వాళ్ళు వెళ్ళిపోతూ కనిపించారు. "మీరెందుకే వెళ్ళిపోతున్నారు" అందామె.

"మళ్ళీ రేపు కలుసుకుందాం" అంది నీలిమ.

ప్రేమ కొంచెం సేపు మౌనంగా నిలబడి ఏదో మాట్లాడబోయి ఆగిపోయింది.

"మీ రెవరో తెలుసుకోవచ్చా?" ప్రశ్నించాడు ప్రకాశ్.

"నేను మా నాన్న కూతురును"

ప్రకాశ్ నవ్వి అన్నాడు "అలా చెప్తే మీరెవరో నాకెలా తెలుస్తుంది? మీ నాన్న పేరు చెప్పండి"

"గోపాలరావుగారు" ప్రేమ క్షణమాగి అంది మీరెవరో నాకసలే తెలియదు"

"మీ సేవకుణ్ని" కొంటెగా చూస్తూ అన్నాడు ప్రకాశ్.

"ఇంతకు ముందు అతిథినన్నారుగా"

"అతిథిగా వచ్చి సేవకునిగా మారినవాణ్ని"

"అంటే?"

ప్రకాశ్ అంతా చెప్పేశాడు. చివరికి అన్నాడు "మీ రైసు మిల్లులో నాకు పని ఇచ్చారు"

"రైసు మిల్లులో మీరేం పని చేయగలరు?"

"పనివాళ్ళతో సక్రమంగా పనిచేయించేపని.

"ఆపని శ్రీధర్ చేస్తుండేవాడే"

"అతడు డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఔరంగాబాద్ వెళ్ళిపోయాడు. అన్నట్టు అడగడం మరిచిపోయాను. ఇన్నాళ్ళూ మీరు ఎక్కడ వున్నారు?"

"హైద్రాబాద్‌లో మా చిన్నమ్మ ఇంట్లో,

"ఎప్పుడు వచ్చారిక్కడికి"

"గంట క్రితం"

"మీ అమ్మ ఎక్కడికి వెళ్ళారు?"

"ఈ వూళ్ళోనే మా మేనత్తవుంది. వాళ్ళఇంటికి వెళ్ళింది"

"టైమెంత అయింది?" ఆమె రిస్టువాచికేసి చూస్తూ అడిగాడు.

"మూడు"

ప్రకాశ్ గబగబా బయటకు వెళ్ళిపోయాడు. సరిగ్గా నాలుగు గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడు.

మణిమాల కాఫీ తెచ్చిఇచ్చింది. ప్రకాశ్ త్రాగి బయటకు పోబోయి ఆగి మణిమాల వైపు తిరిగి ఇంతకు పూర్వం తనకు ప్రేమకు జరిగిన మాటలను నవ్వుతూ చెప్పేశాడు.

మణిమాల చిన్నగా నిట్టూర్పు విడిచి అంది "దానికి సినీమాల పిచ్చి ఎక్కువ బాబూ! సినీమాలు చూడడం, సినిమా పత్రికలు చదవడం వల్ల చదువును అశ్రద్ధ చేస్తూ వుంది. ఈ సంవత్సరం బోర్డు పరీక్షకూడాను. ఎలా పాసవుందో ఏమో"

"ఏం చదువుతుందేమిటి?"

"పదవ తరగతి. శ్రద్ధగా చదివితే ఈ పాటికి ఇంటర్ మీడియట్‌లో వుండేది. ఏడవ తరగతిలో ఫేల్ యింది. ఎర్రగా బుర్రగా వుంటేనే సరిపోయిందా! తెలివిలేని పిల్లను ఎవరు పెళ్ళాడుతారు"

★

అశ్విని చిత్రవారి "లక్ష్మి" లో జగ్గయ్య, జయచిత్ర.

★

ప్రకాశ్ చిన్నగా నవ్వాడు.

"ప్రభాకర్ ఫరవాలేదు బాబూ! వాడు ఇంటర్‌లో ఫస్టుక్లాసులో పాసయ్యాడు. మా అల్లుడు అంటే ప్రేమకు కాబోయే భర్త హైద్రాబాద్‌లో డాక్టర్ కోర్సు చదువుతున్నాడు. ఈ మొద్దుది కనీసం బి. ఏ. అయినా పాసు కాకపోతే ఆ అబ్బాయి చేసుకుంటాడో లేదో అని నా భయం" మణిమాల చెప్పడం ఆపడంతో ప్రకాశ్ రైసు మిల్లు వైపు పోబోయాడు.

"ప్రకాశ్" పిలిచిందామె.

ప్రకాశ్ వెనుదిరిగి చూశాడు.

"ప్రతిరోజు రాత్రి ఓ గంటసేపు దానికి ఏదైనా చెప్తూవుండు. ముఖ్యంగా లెక్కల్లో అది చాలా వీక్‌గా వుంది"

"నేనా!" ఆశ్చర్యంగా అడిగాడు ప్రకాశ్.

"అవును నువ్వే బాబూ! నువ్వు తెలివికలవాడని నాకు తెలుసు. ముఖ్యంగా నేను గమనించింది లెక్కల్లో మా వాడు ఫస్టుక్లాసు స్టూడెంటే అయినా నీలాగా ఇరవైఏడో లెక్కం టకటక చదివేయలేడు. ఆ ప్రతిభ నీలో వుంది. నీకేం అనుమానం వద్దు మేమెంత పని చెప్తుంటామో, చేసేవాళ్ళకు అంత ప్రతిఫలం ఇస్తాంటాం"

"నేను ప్రతిభ కలవాడనని మీరు భావిస్తే నాశక్తి వంచన లేకుండా మీ అమ్మాయికి సహాయం చేస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మణిమాల అక్కడే వున్న కుర్చీలో కూర్చుంది. ఇంటి ముందుకు కారు వచ్చి ఆగింది. గోపాలరావుగారు లోపలికి వస్తూ "ఏమిటే ఆలోచిస్తూ కూర్చున్నావు" అన్నారు.

మణిమాల లేచినిబడి అంది "మన అమ్మాయి విషయమే. మీరేమో రాజకీయాలలో మునిగి పోతున్నారాయే. అమ్మాయి విషయం పట్టించుకోరైతిరి"

"ఏం చేయమంటావే ఇప్పుడు"

"అది ఎలా చదువుకుంటుందో ఎప్పుడైనా ఆలోచించారా?"

"నువ్వు బాగా ఆలోచిస్తున్నావని నేను ఆలోచించడం మానుకున్నాను. అదిసరేగానీ బుధవారం రాత్రి

ఎల్లప్పుడూ......
టి. ఎన్. హెచ్. వారి
* సైనిక్స్ * ఆర్. ఓ.
కలర్ బనిన్లనే
ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

మన ఎం. ఎల్. ఏ. గారు ఇక్కడికి వస్తున్నారు. పది మందికి వంట స్పెషల్‌గా చేయించాలి. మరో ఇరవై మందికి ఆర్డినరీగా చేయించాలి. అన్నట్టు ప్రకాశ్ ఎక్కడవున్నాడు?"

"రైసుమిల్లు వైపు వెళ్ళాడు. రాత్రి పూట అతనికి ఏమనీ చెప్పకండి ప్రేమకు ట్యూషన్ చెప్పేపని అప్పగించాను"

"ట్యూషన్లు చెప్పడానికి ఎంత మంది టీచర్లు లేరు"

"ఉన్నారు, లోగడ చెప్పారుగా?"

"అది వింటేగా"

"వినే ఆసక్తిని వాళ్ళు కలిగించలేదుగా"

"ప్రకాష్ కలిగిస్తాడంటావా?"

కలిగిస్తాడనే నా విశ్వాసం.

అలా అయితే మరో పిల్లవాడిని వెదక్కో వలసి వస్తుంది.

ఎందుకేమిటి?

రాజశేఖరంగారు అదే మన ప్రస్తుత ఎం. ఎల్. ఏ గారు తిరిగి ఎలక్షన్లలో నిలబడుతున్నారు. వారి ప్రచారం కోసం మనం కూడా పాటుబడాలి గదా?

అందుకు ప్రకాష్‌లాంటి కుర్రాడెందుకు?

రాత్రి పూట గోడల మీద ఎన్నికల ప్రచార వాక్యాలు వ్రాయడానికి.

ఇంకేం రాజశేఖరంగారు మళ్ళీ అదిచేస్తాం, ఇదిచేస్తాం అంటూ ఉపన్యాసాలు దంచేస్తారన్నమాట. చెప్పేవి వంద చేసేవి సున్న.

ఎందుకే అలా విమర్శిస్తావు. ఆయన ప్రజలకు ఏమి

చేసినా చెయ్యక పోయినా మనలాంటి వాళ్ళకు ముఖ్యంగా మనకు ఎన్ని సహాయాలు చేయలేదు.

మణిమాల నవ్వుకుంటూ అక్కడినుండి వెళ్ళిపోయింది.

* * *

ప్రకాష్ కుర్చీలో కూర్చుండి వున్నాడు.

ప్రేమ మంచములో కూర్చుండి లెక్క చేస్తూవుంది. ప్రకాష్ పాఠాలు చెప్పడం ప్రారంభించి అయిదురోజులు అయింది. ఈ అయిదు రోజుల్లో లెక్క చేయడంలోనూ మిగతా సబ్జెక్ట్సు చెప్పినప్పుడు శ్రద్ధగా వినడంలోనూ ప్రేమ ఆసక్తి కనబరుస్తూ వుంది. దానికి కారణాలు చాలా ముఖ్యమైనవి రెండు. మొదటిది ప్రకాష్ కంఠం మృదు మధురంగా వుండడం, రెండవది ప్రేమ అభిమాన నటుడు శోభన్ బాబులా ప్రకాష్ ముఖకవలికలు వుండడం. శోభన్ బాబు నటించిన సినిమాలంటే ప్రేమ చాలా ఇష్టపడుతుంది.

ప్రేమ లెక్క చేసి నోట్ బుక్ ప్రకాష్ కందించింది. ప్రకాష్ లెక్కలోని ఒక్కొక్క స్టెప్‌ను చూడసాగాడు. అది చక్రవడ్డీలెక్క. నాల్గవస్టెప్‌లో ఒక అంకె తప్పు వేయడంతో జవాబు తప్పింది. ప్రకాష్ చేసి చూపించాడు.

ప్రకాష్ మరోలెక్క చెప్పబోయాడు.

ప్రేమా! బంగ్లా క్రింది నుండి ఎవరో పిలిచారు.

ఇప్పుడే వస్తానండి అని చెప్పి క్రిందికి వెళ్ళిపోయింది ప్రేమ. పది నిమిషాల తర్వాత మళ్ళీ పైకి వచ్చిన ప్రేమకు ప్రకాష్ కుర్చీలో నిద్రపోతూ కనిపించాడు.

ప్రకాశంగారూ!

ప్రకాశం మాట్లాడలేదు.

ప్రకాశంగారూ! ఈసారి ఆమె అతని భుజముపై చేయివేసి వూపుతూ పిలిచింది.

అతడు కళ్ళువిప్పి 'సారీ' అన్నాడు.

నేనే మీకు సారి చెప్పుకోవాలి. మా స్నేహితురాలితో మాట్లాడి రావడం వల్ల ఆలస్యమైపోయింది.

ప్రకాశం ఇంగ్లీషు పుస్తకం చేతిలోకి తీసుకొని అన్నాడు. నిన్న చెప్పిన స్టోరీ జ్ఞాపకం చేశారా?

లేదండి.

ప్రకాశం క్షణమాగి అన్నాడు. ఈరోజు మ్యాట్నీకి వెళ్ళారు. అవునా?

కాదు.

పోనీ ఎక్కడికి వెళ్ళారో చెప్పండి.

ఈదడానికి.

ఈదడానికా! ప్రకాశం ఆశ్చర్యపోయాడు. మీకు ఈత వస్తుందా? అంటూ అడిగాడు.

ఈత అంటే నాకు చాలా ఇష్టం.

అదిసరే మీరు ఎక్కడ ఈదుతారు.

కోనేరులో.

ఎక్కడ వుందది?

మన ఇంటి వెనుకనే.

ఈత అంటే నాకూ ఇష్టమే. రేపు నాకూ కోనేరును చూపిస్తారా?

తప్పకుండా అని నేలకు ముఖం వేసి అంది. రేపు స్టోరీ మీకు అప్పగిస్తాను. కాని ఈరోజు......

చెప్పండి. సందేహమెందుకు?

మీరు అనుమతి ఇస్తే సినిమాకు వెళ్తాను. మా స్నేహితురాలు వచ్చింది అందుకే.

నా అనుమతా?

అవును మీ అనుమతే_అమ్మనడిగితే మీ అనుమతి తీసుకొని వెళ్ళమంది.

ప్రకాశం ఆశ్చర్యంగా చూచి అన్నాడు. మీ ఇష్టం.

అలా కాదు. మీరు అనుమతి ఇస్తేనే లేకపోతే అమ్మ తిడుతుంది. మా అమ్మ విషయం మీకు తెలియదేమో! మీరు నాకు గురువు అని చెప్పింది. మిమ్మల్ని గౌరవించడం శిష్యురాలిగా నా విధి అనిచెప్పింది. మా అమ్మకు చిన్ననాడు చెప్పిన గురువు ఏ బస్టాండులోనో, రైల్వే స్టేషన్‌లోనో కనిపిస్తే దగ్గరకి వెళ్ళి నమస్కరించి ఏ పళ్ళు కొని బహూకరించి వస్తుంది. ఆమె గురుభక్తి అలాంటిది.

సరే వెళ్ళండి. అని చెప్పి అతడు గబగబా క్రిందికి దిగి వచ్చాడు. క్రింద మణిమాల, శోభారాణి మాట్లాడుతూ కూర్చున్నారు. ప్రకాశంను చూచి అంది మణిమాల. మీరు కూడా వీళ్ళతో కలసి సినిమాకు వెళ్ళిరండి. ఆమె ప్రకాశం తెలివితేటలను గమనించి ఈ మధ్యనే అతణ్ణి గౌరవించడం అలవాటు చేసుకుంది.

(సశేషం)